# 5వ పుష్పము

5. ఓం శ్రీ సాయి - సత్పురుషాయ నమః

పరమేశ్వరుడు, పురుషశబ్ద వాచ్యుడు

1) నామ పారాయణ ప్రియుడు :

సత్ క్ష అవితథం పరంబ్రహ్మ సత్ = నిత్యమైన పరబ్రహ్మము (సత్తు) "సదేవ సోమ్యేద మగ్ర ఆసీత్" (బృ.ఉ.) ఇతిశ్రుతే : "సయత్పూర్వో స్మాత్సర్వాన్ పాప్మాన ఔషత్తస్మాత్పురుషః" ఇతిశ్రుతే : (బృ.ఉ.) = సకల పాపములను పోగొట్టువాడు. ఎవనిచేత జగత్తు అంతా నిండియున్నదో అతడే పురుషుడు. (పూర్ణ అనేన సర్వం). పరమాత్మ సచ్చితానంద స్వరూపుడు. "ఏకం ఏవ అద్వితీయం" = పరంబ్రహ్మము ఒక్కటియేయై యున్నది. రెండవది లేదు. "నేనొక్కడినే" - "నేనే", "ఏకోహం బహుశ్యాం" = బహు రూపముల నొందుదును గాక అను ఈశ్వర సంకల్పము వలననే యీ చరాచర ప్రపంచం పుట్టినది. సత్ క్ష అనగా వున్నది దేశకాల పాత్రలకు అతీతమైనది, మూడు కాలములందున్నది. పురుషుడంటే పురమందు ఉండువాడు. పురమనగా శరీరము. "దేహో దేవాలయః" = ఈ దేహమే దేవాలయము. అందు ప్రతిష్ఠింపబడు వాడు సాయిపరమేశ్వరుడే. అంతర్యామి హృదయేశ్వరుడు. "పురి శయనా ద్వా పురుషః సవా అయం పురుష సర్వాను పూర్షు పురశయః" ఇతిశ్రుతేః = అన్నిటికంటెను ముందున్న వాడు. అట్టి సత్పురుషునకు నమస్కారము చేయుచున్నాను.

2) కవీశ్వరుడు

"నా స్వరూపమేమిటి" అని స్వామి దివ్యవాణిచే తన స్వరూపము తానే చెప్పకున్నారు.

1. సత్యమే నా ప్రచారము
2. ధర్మమే నా ఆచారము
3. శాంతియే నా స్వభావము
4. ప్రేమయే నా స్వరూపము

ఈ నాలుగింటికి అఖండార్థములు వున్నాయి. వీటికి భాష్యము వ్రాయాలంటే ఏ శంకరులో వ్రాయాలి.

సత్యమును రెండు విధములుగా చెప్పారు. (1) వ్యవహారిక సత్యం (2) పారమార్థిక సత్యం. నిత్య వ్యవహార ములో ఉపయోగించుకునే సత్యం. ఇది తాత్కాలికము. రెండవ సత్యము త్రికాలాబాధ్యము. దేశ కాలాతీతము. మూడు కాలములలో నుండునది. నిన్న ఉన్నది, ఇవాళ వున్నది. రేపు ఉంటుంది. అఖండ మైనది. ఈ పారమార్థిక సత్యమే స్వామి ప్రచారము. (3) ధర్మమనగా సామాన్యంగా న్యాయమని అర్థం. నిత్యాచరణలో పెట్టవలసినది. ఒరులు తనకు ఏది చేస్తే తనకు బాధయో, అది తాను యితరులకు చేయకుండా వుండటమే పరమ ధర్మము. ఇది స్వామి ఆచారము. (4) శాంతి క్ష ఇదిమూడు విధములు. ఆదిభౌతిక, ఆదిదైవిక, ఆధ్యాత్మిక, మనకు తాప త్రయాలు మూడు విధములు. ఇవి శాంతిని కూర్చకఅశాంతిని కూరుస్తాయి. ఇవి తొలగటానికే మూడుసార్లు ఓంశాన్తి, శాన్తి, శాన్తిః అని పలిస్తారు. త్రివిధ తాపములు లేనివంటి శాంతిగలవారు స్వామి. అదియే వారి స్వభా వము. (5) ప్రేమయే స్వామి స్వరూపము. స్వామి Essence లేక అఖండైక రసమే స్వామి స్వరూపము.

3) సకలతత్త్వ బోధకుడు

స్వామి ఒకసారి యోగము గురించి దివ్యబోధ చేశారు. "దేహమును పుష్టివంతముగను, మనస్సును ఆరోగ్య వంతముగను ఉండేటందులకు అనుకూలమైన యోగమును కొంతవరకు నేర్పించాలి. కొంతమంది యోగము ను కసరత్తుగా మాత్రమే ప్రాక్టీసు చేసి, విదేశాలకు వెళ్ళి యోగా సెంటరు అని పెద్ద బోర్డు పెట్టుకొని ఈ కసరత్తు లన్నీ చేస్తూయుంటారు.ఇది యోగమని చెప్పటకు వీలుకాదు. ఇది పెద్ద రోగము. మత్స్యాసనము, కూర్మాసనము, సూర్యాసనము అని ఏవేవో ఆసనములు నేర్చుకొని వాటిని యోగమనే పేరుతో వ్యవహరిస్తున్నారు. పతంజలి చెప్పిన యోగమునకును, ఈ యోగమునకును ఎక్కడా పోలిక లేదు. చిత్తవృత్తులను అరికట్టడం గాని, ఆత్మ

సాక్షాత్కరమునకు లేక ఆత్మానుభవమునకు గాని ఏమాత్రము పనికిరాదు. చిత్తశుద్ధికి మాత్రమే పనికి వస్తుంది. షడ్ దర్శనాలు కాదు సత్ దర్శనం కావాలి."

4) సర్వజ్ఞుడు

యోగము అనగా ధ్యానము, ఉపాయము, కూడిక, కూర్పు, ప్రయత్నము, ప్రాణాయామాదికము. యోగాభ్యాసమనగా జీవాత్మ పరమాత్మ సంయోగమును పొందుటకు చేయు అభ్యాసము. యోగశాస్త్ర మనగా ఆత్మానాత్మ వివేకమును స్పష్టపరిచెడి సాంఖ్య యోగము, కర్మయోగములు. ఇవి చెప్పబడే గ్రంథము భగవద్గీత ఇందు 18 అధ్యాయములు యోగములనియే పేర్కొనబడినవి. ఎందుకనగా ఇవి జీవబ్రహ్మైక్యము (జీవుడు, బ్రహ్మముల యొక్క కూడికను కూర్పును) తెలుపుతాయి. వీటిని తెలిసిన వారు శ్రీకృష్ణులు. శ్రీకృష్ణుని యోగేశ్వరుడన్నారు. ఆధ్యాత్మికంగా శ్రీ శంకరులు ఈ యోగమును గురించి తమ బ్రహ్మసూత్ర భాష్యంలో చర్చించారు.

బ్ర.సూ. 137 యే తేన యోగః ప్రత్యుక్తః (2-1-3)

సాంఖ్య స్మృతిని నిరాకరించుటచేతనే, యోగ స్మృతియు నిరాకరింపబడినదని తెలుసు కోవలయును. చేతనుడు జగత్కారణము. ప్రధానము అచేతనము - జడము. అందుచే జగత్కారణము కాజాలదు అని వేదాంతము. ప్రధానము యోగులు, సాంఖ్యులు, ద్వైతులు, వీరి మతమందు జీవేశ్వరులకు భేదము కలదు. వేదము ఏకాత్మత్వము చెప్పచున్నది.యోగము ఆత్మసాక్షాత్కారత్వమునకు గాని, ఆత్మానుభవమునకు గాని పనికి రాదు. యోగ శాస్త్రములో కొంత ప్రామాణికము, కొంత అప్రామాణికము కలదు. వేదమంతయు ప్రామాణికమే. వేదము అపౌరుషేయమే కదా! 'యోగా చిత్తవృత్తి నిరోధా' = మనస్సును కొంతవరకు నిలకడ చేస్తుంది. "నా వేద విన్మనుతే తం బృహ" =వేదవేత్త కానివాడు ఆ పరమేశ్వరుని ఎరుగలేడు. "తమేవ విదిత్వాతి మృత్యుమేతి" = ఏక రూపుడగు నాయాత్మను తెలిపికొనిననే గాని, మోక్షము దొరకదు. మోక్షమునకు వేద తాత్పర్య జ్ఞానమే సంధానము (దారి)".

5) ప్రేమ స్వరూపుడు

మనము ఎవరికి సేవ చెయ్యాలి? ప్రేమస్వరూపుడైన స్వామి యిట్లా అంటారు. "ఎట్టివారికి సేవ సల్పినను, దైవానికే చెందుతుంది అనే భావముండవలెను. భగవంతునికి రెండు రూపములున్నాయి. లక్ష్మీనారాయణుడు అనియు, దరిద్రనారాయణుడనియు రెండు రూపములు. లక్ష్మీనారాయణునకు ఎట్టి సేవ చేయనక్కరలేదు. అది పేరునందే తెలియుచున్నది. కాని దరిద్రనరాయణుడు ఒంటరివాడు. అట్టి దరిద్ర నారాయణుడు దీనుడు. అందుచే దరిద్రనారాయణునకు తప్పక సేవ చెయ్యాలి". ఆ ప్రేమ స్వరూపుడు, ఎప్పడో తెలియదు (ఎందుకంటే అప్పటికి సృష్టి లేదు కనుక) 'అహం బహుశ్యాం' అని "నేను అనేకం అవుదును గాక" అని సంకల్పించాడు. సంకల్పము మాత్రము చేతనే యింత సృష్టి జరిగితే తక్కినవి ఆ స్వామికి లెఖ్ఖ ఏమిటి?

దివ్యలీల : ఒకసారి స్వామి ఒక వెండి పాత్ర, బంగారపు చెంచా, అమృతం సృష్టించి భక్తులందరికి పంచి పెట్టారు. ప్రేమస్వరూపుడైన స్వామి 11 సంవత్సరముల వయస్సు గల రాము, సీతామహాలక్ష్మి కుమారునకు, పక్ష వాతమునకు దివ్యచికిత్సచేసి అద్భుతంగా ఆ కుర్రవానిని నడిపించారు. అది స్వామిపై అనన్య భక్తిగల సీతామహా లక్ష్మికే చెల్లుబడి అయింది.శ్రీరాముని యందు అనన్యభక్తి గల హనుమంతుడు సముద్రము దాటి సీతామహాదేవిని దర్శించి లంకను కాల్చి మరలివచ్చి శ్రీరామునకు సీత క్షేమవార్త విన్నవించాడు.

6) సకలజన ప్రియుడు

స్వామి అంతరంగ భక్తులలో శ్రీ గోకక్ ఒకరు. అతను చాలా గొప్ప మేధావి. చాలా కాలము అరవింద యోగి ని సేవించి చివరకు స్వామిని దర్శించి శాంతిని పొందాడు. మొదటిరోజున చూచిన తర్వాత "దర్శన్" అనే స్వామిని గురించి పద్యములు వ్రాశాడు.

"He is beyond Physics and Chemistry." అని వ్రాయగలిగినాడు. సత్యసాయి యూనివర్శిటీకి మొదటి వైస్ ఛాన్సలరు. విద్యమీద స్వామికి సలహాదార్ అని అంటారు. గోకక్ అనుభూతులు ఎట్లా వుంటాయి : "స్వామి మనుష్యుడు ఆకారములో యున్న భగవంతుడని మేమంతా నమ్ముతున్నాము. మనదేశంలో లక్షలాదిగా భక్తులున్నారు. విదేశములలో కొన్ని వేలమంది భక్తులున్నారు. మనమంతా దేహానికి బానిసలము. స్వామికి దేహం బానిస. అంటే పంచభూతాలు స్వామికి బానిసలు. మొదటి 16 సం॥లు స్వామి ఆటపాటల యందు జీవితం గడిపారు. బాల లీలలు అయిన తర్వాత, తరువాత 16 సం॥లు అత్యాశ్చరకరమైన మహిమలు చేసి చూపించారు. అవి నిదర్శనంకోసం గాని, ప్రదర్శనకోసం కావని స్వామి అన్నారు. తరువాత 18 సం॥లు ప్రజలకు బోధలతో గడిపారు. ప్రతిదీ అంచనా వేసేవారు. ప్రతి విషయము స్వామి చెప్పినట్లు జరిగేది. ఇప్పడు ప్రశాంతి నిలయంలో స్థిరపడి భక్తులకు సాధన మార్గాలను బోధిస్తున్నారు. ప్రశాంతి నిలయమే యిప్పడు ప్రపంచ విఖ్యాత కేంద్రంగా మారిపోయింది. అన్ని ఆధునిక సౌకర్యాలు వున్నాయి.

1973 సం॥లో ఒక భక్తుడు శివరాత్రి ఉత్సవాలలో 2 లక్షల రూపాయలు విలువ చేసే ఒక బంగారు కిరీటాన్ని స్వామికి బహూకరించారు. స్వామి దానిని షిర్డిబాబా విగ్రహానికి అలంకరించారు. అంతా ఒక ప్లాను ప్రకారము జరుగు తోంది.

7) స్తుతి ప్రియుడు

స్వామికి భజన అంటే అత్యంత ప్రియము. ప్రతి ఉపన్యాసము తరువాత వారు భజన చేసి, భక్తుల చేత చేయిస్తారు. నగర సంకీర్తనం గురించి యింకా యిట్లా అంటారు. "చల్లటి గాలిలో తీయని నామమును పాడుచు, మెల్లగా దేహాన్ని కదిలించుచూ, ఈ బింబములు, ఆ ప్రతిబింబములు రెండు, మధుర నామామృతాన్ని గ్రోలి, ఆనందముతో కళకళలాడుతూ వుంటే, సూర్యోదయముగాక నిత్యము ఆనందోదయమే.

దివ్యభజన : రామకృష్ణ గోవింద విఠల్ రఘుమాయి
పాండురంగ శ్రీరంగ సాయిమురారి ॥రా॥
రాధా రమణహరి ప్రభు గిరిధారి
భక్త మందారు సాయి హృదయ విహారి ॥రా॥

8) వేదాంతవేద్యుడు

కఠోపనిషత్తు సాయి పరమేశ్వరుని ఎట్లు వర్ణించింది.

మం॥ నజాయతే మ్రియతే వా విపశ్చి। న్నాయం కుతశ్చి
న్నబభూవ కశ్చిత్। అజో నిత్యో శ్శాశ్వతోయం పురాణో।
న హన్యతే హన్యమానే శరీరే ॥ (1-2-18)

తా॥ ఈ ఆత్మ ఎట్టివాడు? జనన మరణములు లేనివాడు. సర్వజ్ఞుడు, దేని నుండియు నతడు కలుగలేదు. అతని వలన నుండి యెవరును కలుగలేదు. అజుడు, నిత్యుడు, శాశ్వతుడు, పురాణపురుషుడు - హింసింపబడు శరీరములో నుండి, హింస పొందనివాడు. అనగా హింసనొందు శరీరమునందుండనివాడు.

మం॥ హంతా చే న్మన్యతే హంతుగ్ం హతరేచ్చే న్మన్యతే హతం।
ఉభౌతౌ న విజానీతో నాయ్ం హంతి న హన్యతే ॥ (1-2-19)

తా॥ చంపువాడు చంపుటకు తలంచుచున్నాడు - (అనగా నేను చంపగలననెడి అహంకారము పొందుచున్నాడు) చంపబడువాడు తాను చంపబడుదునని తలంచుచున్నాడు. ఈ ఇర్వురును ఆత్మయనగా తెలియనివారు. వాడు చంపెడివాడునుకాదు - వీడు చంపబడెడివాడును కాదు. ఏలననగా ఆత్మ ఆకాశము వలె వికార రహితుడగుట చేత, ఆత్మ ఒక్కని చంపుటయు లేదు. ఒకని చేత చంపబడుటయు లేదు. కనుక ధర్మాధర్మాది లక్షణమగు సంసారమంతయు, అనాత్మజ్ఞ విషయముగాని, బ్రహ్మజ్ఞ విషయము మాత్రము కాదు. శ్రుతి

ప్రామాణ్యము వల్లను, న్యాయము వల్లను, బ్రహ్మజ్ఞునకు ధర్మాధర్మాధికము కలుగజాలవు. వివేకియగువాడు సర్వదా ముక్తుడు గదా!

ఓం తత్సత్

గమనిక : కటోపనిషత్తులోని ఈ రెండు మంత్రములు యోగవాసిష్ఠములోను, భగవద్గీతయందును ఉన్నాయి. ఆశ్చర్యము, యోగవసిష్ఠము త్రేతాయుగము నాటిది. భగవద్గీత ద్వాపరయుగం నాటిది. యోగవాసిష్ఠములో అర్జు నోపాఖ్యానమున్నది.